# ఇందిరమ్మ ఇళ్లు ఉన్నోళ్ల కేనా....?






సోమవారం 17 ఆగస్టు 2026 పేజీలు : 8





**కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించిన 727.67 కోట్ల నష్టం కేసులో ఎఫ్ఐఆర్‌పై హైకోర్టు ఆగ్రహం**

**అంతర్గత విజిలెన్స్ విచారణతో పాటు క్రిమినల్ చర్యల పరిస్థితిని స్పష్టంగా తెలియజేయాలని ఆదేశం**

**తదుపరి విచారణ సెప్టెంబర్ 10న జరగనుంది**

కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించిన 727.67 కోట్ల నష్టం, అవకతవకల ఆరోపణలపై ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై జార్ఖండ్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో అంతర్గత విజిలెన్స్ విచారణ కొనసాగుతున్నప్పటికీ, బాధ్యులపై క్రిమినల్ చర్యలు ప్రారంభించారా లేదా అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు, ఇతర ప్రతివాదులను హైకోర్టు ఆదేశించింది.



# ఆడపడుచులకు ప్రీతిపాత్రమైన నేడు పవిత్ర నాగపంచమి

హైందవ సనాతన సాంప్రదాయాల్లో ఆడపడుచులకు అత్యంత ప్రీతి పాత్రమైన పవిత్ర నాగపంచమి నేడు సోమవారం జరగనుంది ప్రతిఏటా శ్రావణమాసంలో వచ్చే ఈ నాగపంచమి పండుగను అత్యంత భక్తి భావనలతో ముఖ్యంగా ఆడపడుచులు ఆయా ప్రాంతాల్లో గల పాముల పుట్టలకు ప్రత్యేక పూజలు పూలు పాలు పండ్లు సమర్పించి నాగదేవతను పూజిస్తారు ఈ సందర్భంగా నిర్మల్ జిల్లాలోని నిర్మల్ ముధోల్,ఖానాపూర్ నియోజకవర్గాల్లో పల్లె పల్లెలో హిందూ స్త్రీలు ప్రాత కాలంలోనే (ఉదయం) లేచి తలాస్నానం చేసి మంగళ హారతులతో కొత్త వస్త్రాలు ధరించి పుట్ట మీది పేలాలుగా జొన్నల తో చేసిన పేలాలను దాంతో పాటుగా పుట్నాలుగా పిలిచే చనిగా లను నాగదేవతకు ఆహారంగా నైవేద్యాన్ని పాలతో పాటు తీసుకెళ్లడం ఆనవాయితీ



# రాష్ట్రానికి శాశ్వత రాజు లాగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు



**మంచిర్యాల, 16, ఆగస్టు (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై కేంద్ర ప్రభుత్వ ముద్ర, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోటో లేకపోవడాన్ని ఖండిస్తూ, అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కేవలం ఈ ఏడాది విద్యార్థులకే ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి మంచిర్యాల జిల్లా బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతో ప్రజలందరికీ ఉచితంగా ప్రతి ఒక్కరికి 5 కిలోల రేషన్ బియ్యం అందిస్తోంద న్నారు. అయితే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తామే పూర్తిగా రేషన్ బియ్యం అందిస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పంపిణీ చేస్తున్న రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి ఫోటో పెట్టుకొని శాశ్వత రాజులాగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు పెట్టకుండా కేవలం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అధికారిక ముద్రలతో రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో మాత్రం కేంద్ర ప్రభుత్వ ముద్ర, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోటో లేకుండా రేషన్ కార్డులు పంపిణీ చేయడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల పదవులు శాశ్వతం కాదని, పేద ప్రజలకు అందించే రేషన్ కార్డులు శాశ్వతంగా ఉంటాయని రఘునాథ్ వెరబెల్లి అన్నారు. కాబట్టి రేషన్ కార్డులపై వ్యక్తుల ఫొటోలకు ప్రాధాన్యత ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారిక ముద్రలతో రేషన్ కార్డులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

**పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి**

పేద విద్యార్థులకు అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఈ విద్యా సంవత్సరానికి చెందిన విద్యార్థులకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని ప్రకటిస్తే, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పరిస్థితి ఏమిటని రఘునాథ్ వెరబెల్లి ప్రశ్నించారు. బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల వల్లే రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రకటన చేసిందన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, ఇతర ఉన్నత విద్యా కోర్సులు పూర్తి చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులకు కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఉద్యోగాలు పొందలేక, ఉన్నత విద్యను అభ్యసించలేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని రఘునాథ్ వెరబెల్లి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, గాజుల ముకేష్ గౌడ్, దుర్గం అశోక్, పెద్దపల్లి పురుషోత్తం, బేర సత్యనారాయణ, గోలి రాము, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, ఎనగందుల కృష్ణమూర్తి, తుల ఆంజనేయులు, అమెరిశెట్టి రాజ్ కుమార్, పట్టి వెంకట కృష్ణ, బియ్యల సతీష్ రావు, పచ్చ స్వప్న రాణి, మెట్టుపల్లి జయరామ రావు, రంగ శ్రీశైలం, నాంపల్లి శ్రీనివాస్, కర్ర లచ్చన్న, చిరంజీవి, రాకేష్ రెన్వ, కొండ వెంకటేష్, ముదాం మల్లేష్, గాజుల ప్రభాకర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలు అందిస్తున్న ఉద్యోగులను ప్రోత్సహించడం టీఎన్జీవో సంఘం లక్ష్యము




## జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి

## ఉత్తమ అధికారులకు ఘన సన్మానం

**మంచిర్యాల, ఆగస్టు 16 (ప్రజాజ్యోతి):** ఉత్తమ సేవలు అందిస్తున్న ఉద్యోగులను ప్రోత్సహించడం టీఎన్జీవో సంఘం లక్ష్యమని జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి అన్నారు . టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, మాజీ జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్ జన్మదినోత్సవ వేడుకలు టీఎన్జీవో భవన్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాపురావు, రామ్మోహన్‌లకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయిలో ఉత్తమ అధికారి అవార్డు పొందిన టీఎన్జీవో మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షులు, నాయబ్ తహసిల్దార్ కుర్మచలం శ్రీనివాస్‌తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు బి. రాజేందర్‌ను టీఎన్జీవో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు ఉత్తమ సేవలు అందిస్తున్న ఉద్యోగులను ప్రోత్సహించడం టీఎన్జీవో సంఘం లక్ష్యమన్నారు. ఉత్తమ అధికారి అవార్డులు పొందిన సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి బొడ్డు శ్రావణ్ కుమార్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, కోశాధికారి సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు తిరుపతి, రాంకుమార్, అంజయ్య, సత్యనారాయణ, నరేందర్, కేజియా రాణి, సంయుక్త కార్యదర్శులు సునీత, ప్రభు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మోసిన్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్, కార్యదర్శి అజయ్, ఉపాధ్యక్షులు ప్రకాష్, మందమర్రి యూనిట్ అధ్యక్షులు సుమన్ సుమన్, బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో సుగుణక్క బర్త్‌డే వేడుకలు

ఆదివాసీల ఆశాజ్యోతి సుగుణక్క: సుజాయిత్ ఖాన్



**కెరమెరి, ఆగస్టు 16 ప్రజా జ్యోతి** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క జన్మదిన వేడుకలను కెరమెరి మండల కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ సుజాయిత్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సుగుణక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా సుజాయిత్ ఖాన్ మాట్లాడుతూ ఆత్రం సుగుణక్క ఆదివా సీల ఆశాజ్యోతిగా, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తు న్నారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, ఆపదలో ఉన్న వారికియ సహాయం అందిస్తున్నారని కొనియాడారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆమె చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. సుగుణక్క నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

సెప్టెంబర్ 16 నుంచి 20 వరకు 13వ జాతీయ మహాసభలు



**ఆసిఫాబాద్, ఆగస్టు 16 ప్రజా జ్యోతి** సెప్టెంబర్ 16 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న 13వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ కొమురంభీమ్ జిల్లా కార్యదర్శి గోగార్ల తిరుపతి పిలుపునిచ్చారు. ఆదివారం ఆసిఫాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని మెజారిటీ ప్రజలు సామాజిక, ఆర్థిక, రాజకీయ దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడుతున్నప్పటికీ పాలకులు ప్రజా సమస్యలను పరిష్కరించకుండా కార్పొరేట్, భూస్వామ్య శక్తుల ప్రయోజనాలను కాపాడుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలతో దేశ సంపద కొద్దిమంది కుబేరుల చేతుల్లో కేంద్రీకృతమవుతోందని విమర్శించారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాల కారణంగా ప్రభుత్వ రంగ సంస్థలు బలహీనపడుతున్నాయని, ఉద్యోగ భద్రత తగ్గి కార్మిక హక్కులు దెబ్బతింటున్నాయని అన్నారు. విద్య, వైద్యం, విద్యుత్, రవాణా వంటి ప్రాథమిక రంగాలు వ్యాపారాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేక అప్పుల భారం పెరుగుతోందని, విద్యా ర్థులు అధిక ఫీజులతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు ఐక్యంగా ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపు నిచ్చారు. జాతీయ మహాసభలకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పెందూర్ ప్రియాంక, సిడం శ్రీదేవి, సిడం నగేష్, చాకటి దుందేరావు, ప్రియా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించిన

### 727.67 కోట్ల నష్టం కేసులో ఎఫ్ఐఆర్‌పై హైకోర్టు ఆగ్రహం

### అంతర్గత విజిలెన్స్ విచారణతో పాటు క్రిమినల్ చర్యల పరిస్థితిని స్పష్టంగా తెలియజేయాలని ఆదేశం

### తదుపరి విచారణ సెప్టెంబర్ 10న జరగనుంది

**మంచిర్యాల, 16, ఆగస్టు (ప్రజాజ్యోతి):** కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించిన 727.67 కోట్ల నష్టం, అవకతవకల ఆరోపణలపై ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై జార్ఖండ్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో అంతర్గత విజిలెన్స్ విచారణ కొనసాగుతున్నప్పటికీ, బాధ్యులపై క్రిమినల్ చర్యలు ప్రారంభించారా లేదా అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు, ఇతర ప్రతివాదులను హైకోర్టు ఆదేశించింది. కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ నిధుల నిర్వహణలో తీసుకున్న నిర్ణయాల కారణంగా 727.67 కోట్ల మేర నష్టం జరిగినట్లు పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఫండ్ నిర్వహణలో జరిగిన తప్పిదాలు, అధికారులు తీసుకున్న తప్పుడు నిర్ణయాల కారణంగానే భారీగా నష్టం వాటిల్లిందని వారు ఆరోపించారు. పెట్టుబడుల పర్యవేక్షణకు బాధ్యత వహించిన అధికారులు ఫండ్ మేనేజర్లు, నిపుణులు ఇచ్చిన సలహాలను పట్టించుకోలేదని కూడా పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ వ్యవహారంపై ఇప్పటివరకు ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని వారు కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు, కేవలం అంతర్గత విజిలెన్స్ విచారణ నిర్వహించడం మాత్రమే సరిపోతుందా అని ప్రశ్నించింది. 727.67 కోట్ల నష్టం జరిగినట్లు ఆరోపణలు ఉన్నప్పుడు ఇప్పటివరకు ఎలాంటి క్రిమినల్ చర్యలు ప్రారంభించారో స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించింది. ఒకవేళ ఎలాంటి క్రిమినల్ చర్యలు ప్రారంభించకపోతే, ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ఏదైనా ప్రతిపాదన ఉందా, లేదా ఇతర క్రిమినల్ చర్యలు తీసుకునే అంశం పరిశీలనలో ఉందా అనే విషయాన్ని కూడా కోర్టుకు వివరించాలని హైకోర్టు స్పష్టం చేసింది. అంతర్గత విజిలెన్స్ విచారణకు అదనంగా క్రిమినల్ చర్యల విషయంలో ఇప్పటివరకు జరిగిన పురోగతిని తెలియజేయాలని ప్రతివాదులను ఆదేశించింది. ఫండ్ నిర్వహణలో జరిగినట్లు




ఆరోపణలు ఎదుర్కొంటున్న తప్పిదాలు, తప్పుడు నిర్ణయాలు, పెట్టుబడుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వంటి అంశాలపై బాధ్యులుగా ఉన్న అధికారులపై ఏ చర్యలు తీసుకున్నారో కూడా వివరించాలని కోర్టు కోరింది. బాధ్యులపై క్రిమినల్ చర్యలు ఎందుకు ప్రారంభించ లేదనే అంశాన్ని కూడా స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించింది. ఈ వ్యవహారంపై అన్ని ప్రతివాదులు వివరణాత్మక అఫిడవిట్‌లు దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడానికి కారణాలు, ఇప్పటివరకు జరిగిన విజిలెన్స్ విచారణ, బాధ్యులపై తీసుకున్న చర్యలు, భవిష్యత్తులో తీసుకోబోయే క్రిమినల్ చర్యలకు సంబంధించిన పూర్తి వివరాలను అఫిడవిట్‌లలో పొందుపరచాలని సూచించింది. 727.67 కోట్ల నష్టం, అవకతవకల ఆరోపణలపై కేవలం అంతర్గత విచారణకే పరిమితం కాకుండా, ఎఫ్ఐఆర్ లేదా ఇతర క్రిమినల్ చర్యల విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారా లేదా అనే విషయాన్ని కోర్టుకు తెలియజేయాలని హైకోర్టు ఆదేశించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కేసుపై తదుపరి విచారణ సెప్టెంబర్ 10న జరగనుంది.

## గోనెల మధుసూదన్ మరణం సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘానికి తీవ్ర లోటు

**మంచిర్యాల, 16, ఆగస్టు (ప్రజాజ్యోతి):** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకుడు గోనెల మధుసూదన్‌కు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముందు ఆయన చిత్రపటానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ, బెల్లంపల్లిలోని హనుమాన్ బస్తీ, 24 డీబీ ఏరియా కంపెనీ క్వార్టర్స్‌లో నివసిస్తూ సింగరేణి మందమర్రి ఏరియాలోని సర్వే డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహించిన గోనెల మధుసూదన్ ఎన్నో కార్మిక పోరాటాల్లో పాల్గొన్నారని తెలిపారు. పదవీ విరమణ అనంతరం క్యాతనపల్లి ఎక్స్‌రోడ్డులోని గాంధారి కాలనీలో సొంత గృహం నిర్మించుకుని నివసిస్తూ సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాల్లో భాగస్వామ్యమయ్యారని గుర్తుచేశారు. ఆయన మరణం సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘానికి తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం గోనెల మధుసూదన్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు



మౌనం పాటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా "సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకుడు గోనెల మధుసూదన్ అమర్ హై", "గోనెల మధుసూదన్‌కు జోహార్లు" అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పుదారి నర్సయ్య, ఉపాధ్యక్షుడు ఎలబోయిన గంగయ్య, రాష్ట్ర, జిల్లా నాయకులు మామిడాల అంజయ్య, నలగొండ సదాశివ, పోతరాజుల చంద్రయ్య, బూర్ల జ్ఞాని, కాటం లక్ష్మణ్, అడిచర్ల రాజేశం, ఇందారపు రాజన్న, చొప్పదండి బాపు, గోల్కొండ లక్ష్మీనారాయణ, గజెల్లి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం



**మంచిర్యాల, 15, ఆగస్టు (ప్రజాజ్యోతి):** శ్రీ వాసుదేవాయ హెల్త్ కేర్ ట్రస్ట్ వారి సౌజన్యంతో, నిర్మల పాలిక్లినిక్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ కాలనీలోని 6వ డివిజన్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 6వ డివిజన్ కార్పొరేటర్ వనపర్తి కేతా రాజేష్ సహకారంతో, దాత గుత్తికొండ ప్రశాంత్ సహకారంతో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ వైద్య సేవలతో పాటు రక్తపోటు, మధుమేహ పరీక్షలు, కుటుంబ ఆరోగ్య సలహాలు తదితర సేవలను ఉచితంగా అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డా. జి. శ్రీకాంత్, జనరల్ ప్రాక్టిషనర్, డా. కుసుమ నిర్మల, ఆర్థోపెడిక్ సర్జన్ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ముందస్తు వైద్య పరీక్షలు, క్రమం తప్పని ఆరోగ్య పరిరక్షణ ద్వారా అనేక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకొని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేశారు .ఈ కార్యక్రమంలో 5వ డివిజన్ కార్పొరేటర్ తోటపల్లి రాజేశ్వరి, ప్రణయ్, ముక్కెర శ్రీనివాస్, బొజ్జ భూమన్న, శ్రీనివాస్, సంపత్, సాగర్, శ్యామ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## వృద్ధులకు అన్నదానం చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్న సుగుణక్క

### వృద్ధుల ఆశీస్సులే తనకు విలువైనవన్న సుగుణక్క



**ఆసిఫాబాద్ ఆగష్టు 16 ప్రజా జ్యోతి** వృద్ధుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. ఆదివారం తన జన్మదినం సందర్భంగా రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లోని వృద్ధాశ్రమాన్ని ఆమె సందర్శించారు. వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించుకున్నారు.అనంతరం వృద్ధులకు అన్నదానం చేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ వృద్ధుల ఆశీస్సులే తనకు ఎంతో విలువైనవని అన్నారు. వృద్ధుల ఆప్యాయత, ఆశీర్వాదాలు తనకు మరింత సేవ చేయడానికి స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పెన్షన్ అందని వృద్ధుల వివరాలను తెలుసుకుని, వారికి పెన్షన్ అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి వృద్ధుడికి చేరేలా తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వృద్ధాశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆండాళ్ తిరు నక్షత్రం.. భక్తి, ప్రేమ, స్త్రీశక్తికి శాశ్వత ప్రతీక

## వైష్ణవ సంప్రదాయంలో ఏకైక మహిళా ఆళ్వార్ ఆండాళ్

**మంచిర్యాల, 16, ఆగస్టు (ప్రజాజ్యోతి):** భక్తి అంటే భయం కాదని.. భగవంతుడిపై సంపూర్ణమైన ప్రేమ అని మహాభక్తురాలు ఆండాళ్ తన జీవితం, రచనల ద్వారా ప్రపంచానికి చాటారని వేదవ్యాస మాధవి తెలిపారు. భక్తి అంటే కేవలం పూజలు, వ్రతాలు, నియమాలు మాత్రమే కాదని, తన మనసును పూర్తిగా భగవంతుడికి సమర్పించడమే నిజమైన భక్తి అని ఆమె అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామంలో వైష్ణవ సంప్రదాయ కుటుంబాలు శనివారం ఆండాళ్ తిరు నక్షత్ర వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి సంవత్సరం తమిళ ఆడి మాసంలో పుబ్బా నక్షత్రం రోజున ఆండాళ్ తిరు నక్షత్రాన్ని నిర్వహించడం వైష్ణవ సంప్రదాయంలో ఆనవాయితీగా వస్తోంది. తెలుగు సంప్రదాయంలో ఆడి మాసం శ్రావణ మాసానికి సమీపంగా ఉంటుంది. తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరులో విష్ణుచిత్తుడు, తరువాత కాలంలో పెరియాళ్వార్‌గా ప్రసిద్ధి చెందిన మహాభక్తుడు తన తులసివనంలో భగవంతుడికి సమర్పించేందుకు పూలను పెంచేవారని వేదవ్యాస మాధవి వివరించారు. వైష్ణవ సంప్రదాయ కథనం ప్రకారం ఒక రోజు ఆ తులసివనంలో ఆయనకు ఒక దివ్య శిశువు కనిపించగా, ఆ బాలికను తన కుమార్తెగా స్వీకరించి 'కోదై' అని నామకరణం చేశారని తెలిపారు. ఆ కోదైయే తరువాత ఆండాళ్‌గా ప్రసిద్ధి చెందారని పేర్కొన్నారు. బాల్యం నుంచే శ్రీమన్నారాయణుడిపై అపారమైన భక్తిని పెంచుకున్న ఆండాళ్.. సాధారణ భౌతిక జీవితంలోని ఆకాంక్షల కంటే భగవంతుడినే తన జీవిత భాగస్వామిగా భావించారని తెలిపారు. పెరియాళ్వార్ ప్రతిరోజూ శ్రీమన్నారాయణుడికి సమర్పించేందుకు పూలు, తులసిమాలలను తయారు చేసేవారని, ఆ మాలలను ఆండాళ్ ముందుగా ధరించి అద్దంలో చూసుకుని, అనంతరం పెరుమాళ్‌కు సమర్పించేవారని సంప్రదాయ కథనం చెబుతుందని వివరించారు. ఆండాళ్ ధరించిన మాలను భగవంతుడికి సమర్పిస్తున్న విషయం తెలిసిన పెరియాళ్వార్ మొదట బాధపడి, ఆ మాలను సమర్పించడం సముచితం కాదని భావించారని తెలిపారు. దీంతో కొత్త మాలలను తయారు చేసి సమర్పించేవారని, అయితే సంప్రదాయ విశ్వాసం ప్రకారం పెరుమాళ్ ఆ కొత్త మాలలను స్వీకరించకుండా, ఆండాళ్ ధరించిన మాలలనే తనకు ప్రీతికరమని దైవసంకేతం ఇచ్చినట్లు భక్తులు విశ్వసిస్తారని పేర్కొన్నారు. అందుకే ఆండాళ్‌కు 'చూడిక్కొడుత్త నాచ్చియార్' అనే విశిష్టమైన పేరు వచ్చిందన్నారు. తాను ధరించి భగవంతుడికి సమర్పించిన మాలను ఇచ్చిన దివ్య నాచ్చియార్ అనే భావంతో ఈ పేరు ప్రసిద్ధి చెందిందని వివరించారు. వైష్ణవ సంప్రదాయంలోని పన్నెండు మంది ఆళ్వార్లలో ఆండాళ్ ఏకైక మహిళ అని వేదవ్యాస మాధవి తెలిపారు. ఆమె రచించిన రెండు ప్రధాన గ్రంథాలు తిరుప్పావై, నాచ్చియార్ తిరుమొళి అని పేర్కొన్నారు. తిరుప్పావైలో 30 పాశురాలు, నాచ్చియార్ తిరుమొళిలో 143 పాశురాలు ఉన్నాయని వివరించారు. తిరుప్పావైలో భక్తి, ధర్మం, సామాజిక ఐక్యత, భగవత్ ప్రేమలను ఆండాళ్ అత్యంత సుందరమైన కవితా రూపంలో వ్యక్తం చేశారని తెలిపారు. మార్గశిర మాసంలో తెల్లవారుజామున 30 రోజుల పాటు 30 తిరుప్పావై పాశురాలను పఠించడం దక్షిణ భారత వైష్ణవ సంప్రదాయంలో ప్రత్యేక స్థానం పొందిందన్నారు. ఆండాళ్ తన జీవితానికి సంబంధించిన నిర్ణయాన్ని తానే ప్రకటించి, శ్రీమన్నారాయణుడినే తన భర్తగా కోరుకున్నారని వేదవ్యాస మాధవి తెలిపారు. తన భక్తిని ఎవరి అనుమతికీ పరిమితం చేయకుండా, భగవంతుడిపై ఉన్న సంపూర్ణ ప్రేమను తన రచనల ద్వారా వ్యక్తం చేశారని పేర్కొన్నారు. శ్రీరంగంలో ఆండాళ్ పెరుమాళ్‌లో ఐక్యమైందనే విశ్వాసం శ్రీవైష్ణవ భక్తుల్లో అత్యంత పవిత్రమైనదిగా భావించబడుతుందని తెలిపారు. ఆండాళ్ జన్మస్థలంగా ప్రసిద్ధి చెందిన శ్రీవిల్లిపుత్తూరులో తిరు నక్షత్ర పర్వదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు, ఊరేగింపులు ఘనంగా నిర్వహిస్తారని, దేశంలోని



అనేక వైష్ణవ ఆలయాల్లోనూ ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారని వివరించారు. నేటి ఆధునిక ప్రపంచంలో భౌతిక విజయాలు, ఆస్తులు, హోదాలు, అధికారాలు మనిషి జీవితంలో ప్రధానంగా మారుతున్నాయని వేదవ్యాస మాధవి అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మనిషికి లభించిన ప్రతిభను సమాజానికి, భగవంతుడికి అంకితం చేస్తే జీవితం సార్థకమవుతుందని ఆండాళ్ తన జీవితం ద్వారా చూపించారని తెలిపారు. భక్తి, ప్రేమ, ఆత్మసమర్పణతో పాటు స్త్రీ ఆత్మగౌరవం, సంకల్పం, స్వతంత్ర ఆలోచనలకు ఆండాళ్ జీవితం గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు. అందుకే ఆండాళ్ తిరు నక్షత్రం కేవలం ఒక ఆధ్యాత్మిక పర్వదినం మాత్రమే కాకుండా.. భక్తి, ప్రేమ, స్త్రీశక్తికి శాశ్వత ప్రతీకగా నిలిచిందని వేదవ్యాస మాధవి తెలిపారు.

## మంచిర్యాలలో 18న మెగా అప్రెంటిసిప్, జాబ్ మేళా.....

**1147 ఉద్యోగ, అప్రెంటిసిప్ ఖాళీలు.. ప్రముఖ కంపెనీల్లో అవకాశాలు**

**ఐ.టి.ఐ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**మంచిర్యాల ప్రభుత్వ ఐ.టి.ఐ ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వర్ రావు**

**మంచిర్యాల, 16, ఆగస్టు (ప్రజాజ్యోతి):** ఐ.టి.ఐ పూర్తి చేసిన విద్యార్థిని, విద్యార్థులకు ఉద్యోగ, అప్రెంటిసిప్ అవకాశాలు కల్పించేందుకు మంచిర్యాల ప్రభుత్వ ఐ.టి.ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న మెగా అప్రెంటిసిప్ / జాబ్ మేళా--2026 నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐ.టి.ఐ మంచిర్యాల ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వర్ రావు తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఐ.టి.ఐ మంచిర్యాలలో ఈ మేళా ప్రారంభమవుతుందని, ఈ మెగా అప్రెంటిసిప్ మేళాలో మంచిర్యాల జిల్లా దేవాపూర్‌కు చెందిన ఓరియంట్ సిమెంట్స్ (అదానీ గ్రూప్)తో పాటు హైదరాబాద్‌లోని ప్రముఖ బహుళజాతి, ప్రైవేట్ సంస్థలు పాల్గొని అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. మొత్తం 1147 ఖాళీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కంపెనీల వారీగా ఖాళీలు ఇలా ఉన్నాయి. ఎం టి ఎ ఆర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 150 ఖాళీలు, రాణే మద్రాస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100, ష్నైడర్ ఎలక్ట్రికల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100, మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100, ప్రీమియర్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 150, డైనమిక్ టూల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 20, జెన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 80, ఎల్అండ్‌టీ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100, టాటా ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 70, ఐటీసీ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100, శక్తి హార్మన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100, డైనమిక్ ఏరోస్పేస్‌లో 15, దేవాపూర్ ఓరియంట్ సిమెంట్స్ (అదానీ)లో 30, మంచిర్యాల ఆదర్శ్ ఆటోమొబైల్స్ లిమిటెడ్‌లో 30, సహస్ర ఎంటర్‌ప్రైజెస్‌లో 2 ఖాళీలు ఉన్నాయి. పలు ట్రేడ్లలో




అవకాశాలు: ఫిట్టర్, వెల్డర్, టర్నర్, సి ఎన్ సి మెషిన్ టెక్నీషియన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, సి ఓ పి ఎ , డ్రాఫ్ట్‌మన్ సివిల్, సి ఎన్ సి మిల్లింగ్ అండ్ టర్నింగ్, ఎం ఎం వి తదితర ట్రేడ్లలో ఖాళీలు ఉన్నాయి. హైదరాబాద్‌లోని సంస్థల్లో నెలకు ?14,500 నుంచి ?19,000 వరకు, దేవాపూర్ ఓరియంట్ సిమెంట్స్‌లో ?12,000, మంచిర్యాలలోని సంస్థల్లో ?10,000 వరకు జీతం/స్టైపెండ్ అందుబాటులో ఉన్నట్లు ప్రకటించారు. ఐటీసీలో ట్రేడ్‌కు మహిళా అభ్యర్థులకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. తీసుకురావాల్సిన పత్రాలు: అప్రెంటిసిప్ రిజిస్ట్రేషన్ కాపీ, రెజ్యూమ్/ బయోడేటా, ఎస్ఎస్సీ మెమో, ఐటిఐ మెమో, ఎన్ టి సి సర్టిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్, బ్యాంకు పాస్‌బుక్ కాపీ, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. అర్హత కలిగిన ఐ.టి.ఐ పూర్తి చేసిన విద్యార్థిని, విద్యార్థులు ఈ మెగా అప్రెంటిసిప్ / జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని తమ విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగ, శిక్షణ అవకాశాలను పొందాలని ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వర్ రావు కోరారు. మరిన్ని వివరాలకు 9849389325 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

# కవ్వాల్ టైగర్ రిజర్వ్ సర్కిల్ లోనే ఉత్తమ డ్రైవర్ గా ఎంపికైన షేఖ్ హబీబ్

**80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఎఫ్డిపిటి శాంతారాం,చేతుల మీదుగా అవార్డుతో పాటు రూ "3 వేల నగదు రివార్డ్**
**చింతకుంట బీట్ ఆఫీసర్ మల్లికార్జున్, ఎనిమల్ ట్రాక్టర్ గోవిందరావు కు,ఎఫ్డిఓ భార్గవ్ కుమార్ చేతులమీదుగా అవార్డులు**
**సిర్పూర్ (టి)అటవీ క్షేత్ర అధికారి శ్రీనివాస్:**

**ఆగస్టు16,సిర్పూర్(టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం, ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలం అటవీశాఖలోని అటవీ క్షేత్ర అధికారి కార్యాలయంలో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న షేఖ్ హబీబ్ తన విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందిస్తూ కవ్వాల్ టైగర్ రిజర్వ్ సర్కిల్ లోనే ఉత్తమ సేవలు అందిస్తున్న తరుణంలో వారి సేవలను గుర్తిస్తూ 80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా షేఖ్ హబీబ్ ను ఉత్తమ డ్రైవర్ గా ఎంపిక చేస్తూ ఇతని సేవలకు గుర్తింపు గా ఎఫ్.డి.పి.టి, కాంతారాం చేతుల మీదుగా అత్యుత్తమ సేవ పురస్కార అవార్డు తోపాటు రూపాలు 3 వేల నగదు రివార్డు అందుకున్నారని ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ తెలిపారు.అదేవిధంగా చింతకుంట బీట్ ఆఫీసర్ మల్లికార్జున్, ఎనిమల్ ట్రాకర్ గోవిందరావు విశిష్ట సేవలు అందిస్తున్న సందర్భంలో కాగజ్నగర్ ఎఫ్డిఓ భార్గవ్ కుమార్ చేతుల మీదుగా అవార్డు లు అందుకోవడం జరిగిందని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భం గా ఉత్తమ సేవ పురస్కార



అవార్డులు అందుకున్న షేఖ్ హబీబ్,మల్లికార్జున్, గోవింద్ రావులను

ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ అటవీశాఖ సిబ్బంది అభినందించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అటవీ క్షేత్రాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి విధి నిర్వహణ లో ప్రజలకు అండగా ఉంటూ అత్యుత్తమ సేవలు అందించి గుర్తింపు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిర్పూర్(టి) ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను, ముళ్ళ చెట్లను తొలగించి

**స్వతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని అట్టి సందర్భంలో విద్యార్థిని/ విద్యార్థులకు ఉపన్యాస ఆటల పోటీలు నిర్వహణ**
**బహుమతులు ప్రధానం ప్రభుత్వం అందించిన ఉచిత నోట్ బుక్స్ పంపిణీ క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత ఫలితాలు సాధించాలి ప్రిన్సిపాల్ జయమణి:**

**ఆగస్టు 16 సిర్పూర్ (టి) కానిస్టెన్సీ కరెస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ జెండాను ఆవిష్కరించి 80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించిన ప్రిన్సిపాల్ జయమణి స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అట్టి సందర్భంలో కట్టి సందర్భంలో కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను ముళ్ళ చెట్లను తొలగించిన అనంతరం అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులతో కలిసి స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులకు ఉపన్యాస,పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభ్యాసానికి మరింత ప్రోత్సాహం అందించడంతోపాటు వారి విద్య అవసరాలను తీర్చే ఉద్దేశంతో ప్రభుత్వం అందించిన ఉచిత నోట్ బుక్స్ను విద్యార్థిని విద్యార్థులకు



ఒక్కొక్కరికి 12 చొప్పున పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జయమణి మాట్లాడుతూ.. విద్యార్థిని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నతమైన ఫలితాలు సాధించాలని సూచించారు ప్రభుత్వం విద్యార్థిని విద్యార్థు లకు ఉచిత నోట్ బుక్స్ అందించడం వల్ల ఆర్థిక వెసులుబాటు తో పాటు చదువుపై మరింత ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.ఎ ఆసిఫ్, భూపెల్లి తిరుపతి, రమేష్, రవి, శ్యామ్ మూర్తి, ఘనశ్యాం,యాకూబ్ పాషా, కిషోర్, రమణారెడ్డి, సిబ్బంది హర్షిత, నజీర్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కిష్టాపూర్ కేజీబీవీని సందర్శించిన అదనపు కలెక్టర్ చంద్రయ్య

**నిర్మాణ గదులు, భోజన నాణ్యత పరిశీలన**

**జన్నారం,ఆగస్ట్16 (ప్రజాజ్యోతి)** జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామ సమీపంలో గల కేజీబీవీ పాఠశాలను ఆదివారం రోజున మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య సందర్శించారు.ఈ సందర్భంగా అక్కడ నిర్మిస్తున్న డార్మెటరీ,డైనింగ్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు.అలాగే విద్యార్థులకు సిద్ధం చేసిన ఆహా రాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ర్థులకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని,వంట గదిని ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆదివారం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు రావడంతో వారితో మాట్లాడి విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ



కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఎం.శ్రీవాణి, ఎంఈఓ బాణావత్ రాజేందర్, సర్పంచ్ వాసాల నరేష్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## సిర్పూర్(టి)రేంజ్ పరిధిలోని లింబు గూడ అటవీ ప్రాంతం లో కొండగొర్రె కుందేలుని వేటాడి చంపిన కేసులో

**కొమురం కాంతారావు, ఆత్రం శ్యామ్ రావు, చౌదరి సంజు, నికోడే శంకర్ లను అదేవిధంగా డబ్బా సెక్షన్ పరిధిలోని**
**ఆడేపల్లి బీట్ లో అటవీ భూమిని ఆక్రమించిన కేసులో:**
**లోంబడే ప్రభాకర్ ను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా**
**న్యాయస్థానం 13 రోజుల రిమాండ్:**
**ఆసిఫాబాద్ సబ్ జైలుకు తరలించాం. సిర్పూర్(టి)ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్:**



**ఆగస్టు 16సిర్పూర్ (టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని లింబుగూడ అడవి ప్రాంతంలో కొండ గొర్రె, అదేవిధంగా అటవీ కుందేలు ను వేటాడి చంపిన కేసులో లింబు గూడ గ్రామానికి చెందిన కొమురం కాంతారావ్, రావన్పల్లి గ్రామానికి చెందిన ఆత్రం శ్యామ్ రావు, చౌదరి సంజు, నికోడే శంకర్ అనే 4 గురు నిందితు లను అదేవిధంగా డబ్బా సెక్షన్ పరిధిలోని ఆడేపల్లి బీట్ లో అటవీ భూమిని ఆక్రమించిన కేసులో ఆడేపల్లి గ్రామానికి చెందిన లొంబడే ప్రభాకర్ ను శుక్రవారం న్యాయస్థానం ముందు హాజరు పర్చగా మెజిస్ట్రేట్ వీళ్ళందరినీ 13 రోజుల రిమాండ్ విధించారు.అటవీ శాఖ అధికారులు వీరిని ఆసిఫాబాద్ సబ్-జైల్ కు తరలించడం జరిగిందని ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.... వన్య ప్రాణులను వేటాడటం, అటవీ భూమిని ఆక్రమించడం చట్టరీత్యా నేరమని అన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ క్షేత్రాధికారి శ్రీనివాస్ తెలిపారు.

## అంగరంగ వైభవంగా నాగదేవత విగ్రహ ప్రతిష్టాపన



**బెజ్జూర్ ఆగస్టు 16 (ప్రజా జ్యోతి):** మండలంలోని ఎలుక పెల్లి, బెజ్జూర్ గ్రామాల సమీపంలోని నాగుల చెరువు సమీపంలో నాగదేవత విగ్రహ ప్రతిష్టాపన అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి కాగజ్నగర్ త్రినేత్ర ఆలయ ప్రధాన అర్చకులు సాయిరాం శాస్త్రి వేద పండితుల సమక్షంలో విగ్రహ పున: ప్రతిష్టాపన,ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సహకరించిన దాతలు అందరికీ ఆలయ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ రంగనాయక స్వామి ఆలయ అధ్యక్షులు తంగేడి పల్లి మహేష్, ఎలుక పెల్లి హనుమాన్ ఆలయ అధ్యక్షుడు శ్రీనివాస్, కుర్దంగి రామకృష్ణ, సిద్దాపూర్ సర్పంచ్ చెండె పద్మ శంకర్ విలేకరుల బృందం గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి పేదవారికి సొంతింటి కల నెరవేరుతుంది: నారాయణ



**ఆసిఫాబాద్ , ఆగస్టు 16 ప్రజా జ్యోతి** అర్హులైన ప్రతి పేదవారికి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గుర్నూలే నారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని బెండర గ్రామంలో వాడై నిర్మల--పాండురంగ్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి స్లాబ్ పనులను కొబ్బరికాయ కొట్టి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో జంబూలదరి ఉపసర్పంచ్ గుర్నూలే విట్టల్, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కస్తూరిబా విద్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ హరిత**



**ఆసిఫాబాద్ , ఆగస్టు 16 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జైనూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న భోజనం, విద్యాబోధన, వసతి, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, మౌలిక వసతులను పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. వంటశాల, భోజన ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడి వసతి, భోజనం, తాగునీరు, విద్యా సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.విద్యను ఆయుధంగా చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని విద్యార్థినులకు సూచించారు. పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక ప్రణాళికతో బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థినుల భద్రత, ఆరోగ్య పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యం చేయరాదని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం రుచి, నాణ్యతను స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సిర్పూర్(టి)లో శనివారం జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీస్ ల గౌరవ వందనాన్ని స్వీకరించిన సిర్పూర్ (టి) న్యాయమూర్తి అజయ్ ఉల్లం, తాహసిల్దార్ రహీముద్దీన్



**ఆగస్ట్16 సిర్పూర్(టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ (ప్రజాజ్యోతి):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండల కేంద్రంలోని న్యాయస్థాన కార్యాలయంలో న్యాయమూర్తి అజయ్ ఉల్లం, తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ రహీముద్దీన్ 80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని అలపించిన అనంతరం జడ్జి అజయ్ ఉల్లం, తాహసిల్దార్ రహీముద్దీన్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. న్యాయమూర్తి అజయ్ ఉల్లం, విద్యార్థు లకు బహుమతులు అందజేశారు.న్యాయవాదులు రైస్ అహ్మద్,కిషోర్ కుమార్ గణపతి,కళ్యాణ్ వివిధ లాయర్ లతో విద్యార్థు లకు బహుమతులు నోట్బుక్స్ అందజేశారు. మేజర్ గ్రామపంచా యతీ కార్యాలయంలో సర్పంచ్ ఓడ్డెట్టి నాగమణి, ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో సుప్రీండెంట్ డాక్టర్ జోగేందర్, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో,ప్రసాద్, మండల విద్యాధి కార్యాలయంలో ఎంఈఓ సదాశివుడు, వ్యవసాయ కార్యాలయంలో అగ్రికల్చర్ ఆఫీసర్ గిరీష్,అటవీ క్షేత్రాధి కార్యాలయంలో ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రిన్సిపాల్ సుధా, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ప్రిన్సిపాల్ లు లావణ్య, శారద,భాగ్య, ఆశ్రమ బాలికల వసతి గృహంలో హెడ్మాస్టర్ కన్నయ్య, ఆశ్రమ బాలుర వసతి గృహంలో, హెడ్మాస్టర్ రవీందర్, అదేవిధంగా మండలంలోని వివిధ ప్రభుత్వ ప్రవేట్ కార్యాలయాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని 16 గ్రామపంచాయతీలలోని సర్పంచులు,ఉప సర్పంచులు శనివారం రోజున 80 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వతంత్ర సమర యోధుల త్యాగా లను స్మరించుకుంటూ అట్టి సందర్భంలో న్యాయ మూర్తి అజయ్ ఉల్లం, తహసిల్దార్ రహీముద్దీన్ మాట్లాడుతూ..... స్వాతంత్రం కోసం ఎంతోమంది మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరు గుర్తించు కోవాలని అన్నారు. దేశ అభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలని సూచించారు. మహనీయుల త్యాగా లను వారి ఆశయాలను ప్రతి ఒక్కరు గుర్తించు కోవాలని అన్నారు. సమాజ అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. స్వాతంత్ర సమరయోధుల పోరాటాల త్యాగ ఫలితంగానే దేశానికి స్వచ్ఛ లభించింది అని అన్నారు.

## డీసీసీ కార్యాలయంలో ఘనంగా ఆత్రం సుగుణక్క జన్మదిన వేడుకలు

**కేక్ కట్ చేసి మొక్కలు నాటిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క**



**ఆసిఫాబాద్, ఆగస్టు 16ప్రజా జ్యోతి** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్య కర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సుగుణక్కకు నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.జన్మదిన వేడుకల అనంతరం డీసీసీ కార్యాలయ ఆవరణలో ఆత్రం సుగుణక్క నాయ కులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆమె సూచించారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ తన జన్మది నాన్ని పురస్కరించుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చూపించిన ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని అన్నారు. ప్రజా సమస్యల పరి ష్కారానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. సుగుణక్క నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షిస్తూ నాయకులు, కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రె స్ అధ్యక్షుడు గుర్నూలే మెంగజీ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పల కృష్ణ, వాంకిడి మండల సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అగర్వాడలో కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు

**కేరమేరి ఆగష్టు 16 ప్రజా జ్యోతి** గ్రామ ప్రజల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని అగర్వాడ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ సర్పంచ్ వద్గురే రోజా -సోనాజి ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారంతో నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యార్థి విభాగం నాయకుడు హనుమంతు



జిల్లా మాలి సంఘం నాయకుడు అదే అశోక్, యువజన నాయకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## ఏసుగూడ సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి



నేరడిగొండ ఆగస్టు 16 (ప్రజాజ్యోతి):మండల పరిధిలోని ఏసుగూడ గ్రామస్థులు ఆదివారం బోథ్ నియోజకవర్గ శాసన సభ్యులు అనిల్ జాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎదురవుతున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాభివృద్ధి, తాగునీరు, మౌలిక వసతులపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు.గ్రామస్థుల సమస్యలపై ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సానుకూలంగా స్పందించారు. గ్రామంలో ఉన్న సమస్యలన్నింటినీ పరిశీలించి, త్వరలోనే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమానికి, నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

## 40 వసారి రక్త దానం చేసిన సత్తనపల్లి సర్పంచ్ సిర్ల విజయ్ ఆనంద్ కుమార్

కృతజ్ఞతలు తెలిపినబాధిత కుటుంబ సభ్యులు




ఖానాపూర్ ఆగస్టు 16 (ప్రజా జ్యోతి) ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన దుంపటి రాజేశ్వర్ తల్లి లక్ష్మికి డి పాజిటివ్ రక్తం అవసరం కలిగింది ఈ మేరకు బాధ్యత కుటుంబాలు వాకవు చేయగా స్పందించిన మండలంలోని సత్తనపల్లి గ్రామ సర్పంచ్ సిర్ల విజయ్ ఆనంద్ కుమార్ నిర్మల్ జిల్లా కేంద్రంలోని లైఫ్ కేర్ కేంద్రానికి వెళ్లి రక్తదానం చేశారు ఆపదలో ఆదుకున్న సర్పంచువిజయ్ కి బాధ్యత కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు ఇప్పటికీ 40 సార్లు రక్తదానం చేసినట్లు సర్పంచ్ అన్నారు మానవాళిలో ప్రాణదాతలు కావాలంటే రక్తంతో పాటు అవయవాలు సైతం దానాలుగా ఇచ్చి ప్రాణాలను కాపాడాలని ఈ సందర్భంగా కోరారు

## బాదిత కుటుంబ సబ్యుల ను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అదికార ప్రతినిధి



ఇచ్చోడ, ఆగష్టు 16, (ప్రజా జ్యోతి ) ఇచ్చోడ మండలం దుబార్ పేట్ గ్రామానికి చెందిన కాత్లే సూర్య ఇటీవల అనారోగ్యం తో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రె స్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధికార ప్రతినిధి ఆదివాసీ ముద్దుబిడ్డ కుంరం కోటేష్ ఆదివారం ఆకుటుంబ సబ్యులను పరామర్శించారు. సూర్య మృతి కి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. దీనికి ముందుగా సూర్య చిత్ర ఫటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్ర మంలో దుబార్ పేట్ సర్పంచ్ కాత్లే విఠల్, ఇచ్చోడ మండల ఎస్ టి సెల్ అధ్యక్షులు సైతం నాగరాజు, సిడాం గంగారాం పటేల్, గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇంద్రమ్మ ఇళ్లు



ఆసిఫాబాద్, ఆగస్టు 16 ప్రజాజ్యోతి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇంద్రమ్మ ఇళ్ల పథకం పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తోందని వాంకిడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గురునులే మెగాజీ అన్నారు. వాంకిడి మండలం బెండరా గ్రామంలో వాడై నిర్మల పాండు దంపతులకు మంజూరైన ఇంద్రమ్మ ఇంటి స్లాబ్ పూజ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన గురునులే మెగాజీ స్లాబ్ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఇంద్రమ్మ ఇళ్ల నిర్మాణంతో పేద కుటుంబాలకు సొంత గూడు సమకూరుతోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో బెండరా గ్రామ సర్పంచ్ నగోసే భాగ్యశ్రీ అన్నారావు, బంబార గ్రామ సర్పంచ్ బెండారే కృష్ణాజీ, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సెల్వట్కర్ పెంట్లు, సీనియర్ నాయకులు పందిర్ల గుండయ్య, కిషన్, సెల్ మండల అధ్యక్షుడు నికురే సంతోష్, మండల కాంగ్రెస్ పార్టీ కోశాధికారి కోట్రంగే విజయ్‌కుమార్, దుర్గం సంతోష్, వడై పోచయ్య, జాడే అశోక్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి



ఆసిఫాబాద్, ఆగస్టు 16 ప్రజా జ్యోతి విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ. 10,500 కోట్లను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ కొమురంభీం జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం ఆసిఫాబాద్ మండల పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశం జనకపూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. బకాయిలు విడుదల కాకపోవడంతో ప్రైవేటు కళాశాలల్లో చదువుకున్న విద్యార్థులు ఫీజులు చెల్లిస్తేనే ధ్రువపత్రాలు ఇస్తామని యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఐప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు ఆకలితో చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ప్రహరీ గోడలు నిర్మించడంతో పాటు మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.సమావేశంలో పీడీఎస్‌యూ ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు షేక్ సమీర్, ఉపాధ్యక్షుడు శివశంకర్, సహాయ కార్యదర్శి బౌరే వసంత్, కోశాధికారి సిరాజ్, సభ్యుడు మడవి సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# కేక్ కట్ చేసి.. రోగులకు పండ్లు పంపిణీ






### సుగుణక్క నాయకత్వంలో కాంగ్రెస్ మరింత బలోపేతం: మెంగజీ

ఆసిఫాబాద్ ఆగస్టు 16 ప్రజా జ్యోతి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క జన్మదిన వేడుకలను వాంకిడి మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గుర్నులే మెంగజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేక్ కట్ చేసి సుగుణక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గుర్నులే మెంగజీ మాట్లాడుతూ సుగుణక్క నాయకత్వంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. పార్టీ కోసం నిరంతరం పనిచేస్తూ కార్యకర్తలకు అండగా నిలుస్తున్న సుగుణక్క సేవలను ఆయన కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆమె చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో సుగుణక్క మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

### రోగులకు పండ్ల పంపిణీ

జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంతో నిర్వహించడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకున్నామని నాయకులు తెలిపారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సెండే హనుమంతు, ఉపాధ్యక్షుడు సెల్వట్‌కార్ పేంటు, టౌన్ అధ్యక్షుడు కాంలేష్,బంబర సర్పంచ్ క్రిష్ణ, వెల్గి సర్పంచ్ భీంరావ్,ఉప సర్పంచుల జిల్లా అధ్యక్షుడు దీపక్ ముండే, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్, కోశాధికారి విజయ్, సీనియర్ నాయకులు గణేష్, బొట్టుపల్లి జైరాం, దాదాజీ,గుండయ్య,పోర్ల శంకర్,గంగాధర్, పద్మకాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆడపడుచులకు ప్రీతిపాత్రమైన నేడు పవిత్ర నాగపంచమి





**ఖానాపూర్ ఆగస్టు 16 (ప్రజాజ్యోతి)** హైందవ సనాతన సాంప్రదాయాల్లో ఆడపడుచులకు అత్యంత ప్రీతి పాత్రమైన పవిత్ర నాగపంచమి నేడు సోమవారం జరగనుంది ప్రతిఎటా శ్రావణమాసంలో వచ్చే ఈ నాగపంచమి పండుగను అత్యంత భక్తి భావనలతో ముఖ్యంగా ఆడపడుచులు ఆయా ప్రాంతాల్లో గల పాముల పుట్టలకు ప్రత్యేక పూజలు పూలు పాలు పండ్లు సమర్పించి నాగదేవతను పూజిస్తారు ఈ సందర్భంగా నిర్మల్ జిల్లాలోని నిర్మల్ ముధోల్,ఖానాపూర్ నియోజకవర్గాల్లో పల్లె పల్లెలో హిందూ స్త్రీలు ప్రాత కాలంలోనే (ఉదయం) లేచి తలాస్నానం చేసి మంగళ హారతులతో కొత్త వస్త్రాలు ధరించి పుట్ట మీది పేలాలుగా జొన్నల తో చేసిన పేలాలను దాంతో పాటుగా పుట్నాలుగా పిలిచే చనిగా లను నాగదేవతకు ఆహారంగా నైవేద్యాన్ని పాలతో పాటు తీసుకెళ్లడం ఆనవాయితీ నాగుల పాముల నివసించే పుట్ట చుట్టూ 5 ప్రదక్షిణలు భక్తితో చేస్తే పసుపు కుంకుమలతో పాటు నిండు ముత్తయిదువ అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలు కలిగి నాగ దోషాలు కుటుంబాల్లో పటాపంచలై సుఖశాంతులు కలుగుతాయి అన్న నమ్మకం అనాదిగా వస్తుంది ఈ దరిమిల ప్రతి ఇంటి నుండి మహిళలు వయస్సుతో పరిమితం లేకుండా బాలిక స్థాయి నుంచి వృద్ధుల వరకు పాముల పుట్టలను దర్శించుకుని మొక్కులు తీర్చుకొని తమ కోరికలు తీరాలని కోరుకుంటారు

## పుట్ట మీది పేలాల పాల ప్రత్యేకత

నాగ పంచమి రోజు పుట్టకు చేస్తున్న పూజలో భాగంగా పుట్టపై చల్లిన జొన్న పేలాలు పుట్టలో పోసిన పాలలో మిగిలిన పాలకు ఎంతో ప్రత్యేకత సనాతన ధర్మంగా స్థానం ఉంది పుట్ట మీద చల్లిన పేలాలను తిరిగి కొన్ని తమ గృహాలకు తెచ్చుకొని వినాయక చవితి రోజు చంద్రుడు కనబడితే దోషం ఉన్నందున ఈ పుట్ట మీదిపేలాలు ఒకటి రెండు సంఖ్యల్లోనే తింటే చంద్రుని చూసిన దోషం కూడా కలగదని నానుడి ఇక పుట్ట మీది పాల విషయానికొస్తే పుట్టలో పాముకు పోసిన పాలలో కొన్ని మిగిలించి పంచమి రోజే ఇంటికి తీసుకొని వచ్చి సాయంత్రం తోబుట్టువులకు కళ్ళు కడిగితే వారి జీవితాలు సుఖమయంతో పాటు కంటి చూపు కూడా సన్నగిల్లకుండా ఉంటుందని సనాతన ధర్మం ఇలా హైందవ ధర్మంలో ప్రతి పండుగకు ఒక ప్రత్యేకత సంతరించుకోగా నాగపంచమికి ఇలాంటి మంచి ఫలితాలను ఇచ్చే పండగ కావడం వల్ల ఆడపడుచులు తండోపతండాలుగా వెళ్లి అడవుల్లో గ్రామాల సరిహద్దుల్లో దేవాలయ ప్రాంగణాల్లో గల పుట్టలతో పాటు నాగదేవత విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపకాంతులు వెలిగించి నైవేద్యాన్ని మనస్ఫూర్తిగా పెట్టి జీవితం సాఫీగా జరగాలని నాగదేవతను కోరుకుంటారు

# సుగుణక్క నాయకత్వంలో కాంగ్రెస్ మరింత బలోపేతం కావాలి: రాందాస్



**కేరమేరి ఆగస్టు 16 ప్రజా జ్యోతి** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క జన్మదిన వేడుకల్లో గోయగౌవ్ ఉప సర్పంచ్ మొహర్లే రాందాస్ పాల్గొన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జన్మదిన వేడుకలకు ఆయన హాజరై సుగుణక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మొహర్లే రాందాస్ మాట్లాడుతూ ఆత్రం సుగుణక్క నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ జిల్లాలో మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ కార్యకర్తలకు అండగా నిలుస్తున్న సుగుణక్క సేవలు అభినందనీయమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆమె మరింత చొరవ చూపుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సుగుణక్క జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సుగుణక్క సేవా స్ఫూర్తి అభినందనీయం: గుర్నూలే నారాయణ



**ఆసిఫాబాద్ , ఆగస్టు 16 ప్రజా జ్యోతి** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క సేవా స్ఫూర్తి అభినందనీయమని వాంకిడి మండల మాజీ అధ్యక్షులు గుర్నూలే నారాయణ అన్నారు. సుగుణక్క జన్మదిన సందర్భంగా ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఆదివాసీ ముద్దుబిడ్డగా ప్రజల మధ్య ఉంటూ, ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఆమె ముందుకు సాగుతున్నారని అన్నారు.సుగుణక్కకు ఆయురారోగ్యాలు, ఆనందం, విజయాలు కలగాలని, ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. "ప్రజల కోసం నిలిచే నాయకత్వం.. ప్రజల గుండెల్లో నిలిచే సుగుణక్క" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జబుల్‌ధరి ఉపసర్పంచ్ విట్టల్, వాంకిడి యువజన అధ్యక్షులు క్రిష్ణ, ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు మురళి తదితరులు పాల్గొన్నారు.

# మాదాపూర్‌లో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



పాల్గొన్న బోథ్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్



**ఇచ్చోడ, ఆగష్టు 16, (ప్రజా జ్యోతి )** ఇచ్చోడ మండలంలోని మాదాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాదాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ షేక్ ఇమ్రాన్ షాదుల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమం అనంతరం సర్పంచ్ షేఖ్ ఇమ్రాన్ షాదుల్లా జన్మదినం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇచ్చోడ మండల బి ఎల్ ఎ 2, బి ఎల్ ఎ 2 సూపర్వైజర్ లకు చేతి గడియారంలు అందించారు. అనంతరం సర్పంచ్ షేక్ ఇమ్రాన్ షాదుల్లా జన్మదినం సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి, పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి గ్రామ పంచాయతీ భవనాలు ఎంతో కీలకమని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలంటే మౌలిక వసతులు, అభివృద్ధి అవసరమని పేర్కొన్నారు. మాదాపూర్ గ్రామ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కళ్ళెం నారాయణ రెడ్డి, ఇచ్చో డ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సత్యవతి కోటేశ్వర్, సర్పంచ్‌లు బొడ్డు దత్తాత్రి, కాత్లె విఠ ల్, షామిమ్ యూసఫ్, యాదవ్ రావు, గక్వాడ్ జైపాల్, భీంరావు, సుప్రియ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జా హిద్ మొహియుద్దీన్, ప్రవీణ్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు మాధవ్ పటేల్, లక్ష్మారెడ్డి, డీసీసీ కార్యదర్శి పురు షోత్తం రెడ్డి, మైనారిటీ నియోజకవర్గ చైర్మన్ ముస్తఫా, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తూరి లక్ష్మణ్, మాజీ ఎస్సి సెల్ రాష్ట్ర కన్వీ నర్ అనుపట్ల సంజీవ్ కు మార్,మాజీ బోథ్ అసెంబ్లీ అధికార ప్రతినిధి ఎండి సద్దాం, నడికుంట ఆశన్న, మహబూబ్, మజీద్ ఖాన్, ఫరూఖ్, జైపాల్, చోలే ప్రభాకర్, ప్రవీణ్ పాటిల్, అబ్దుల్, రషీద్, సాదిక్, మధుకర్, వినాయక్ ఎఐటియుసి మండల అధ్యక్షుడు కోటేష్, జగ దీష్, గౌసోదీన్, బొజ్జ రవి, గంగారం, శివాజీ, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు ఉన్నోల్ల కే నా....?

**కలెక్టర్ సారు జెర ఇటు సూడు**

**పూరి గుడిసెలో ఉన్నాం**

**ఓ ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చి ఆదుకోరూ**

**సిరికొండ, ఆగస్టు 16,( ప్రజా జ్యోతి )** తాత ముత్తాతల నుంచి పూరి గుడిసెలో కాలం వెల్ల దీస్తున్నాం, కాయా కష్టం చేసి పొట్ట గడువు కుంటున్నాం, రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి మాది. మా తాతలు ఇదే పూరి గుడిసె లో కాలం వెల్లదీశారు. మా తండ్రులు కూడా ఇదే గుడి సెలో కాలం వెల్లదీశారు. ఇప్పుడు మేము ఇదే పూరి గుడిసెలో కాలం వెల్ల దీస్తున్నాం. గత బిఆర్ ఎస్ ప్ర భుత్వంలో పైసలు ఇచ్చి నోల్లకే డబల్ బెడ్ రూమ్‌లు వచ్చాయి. పేదలకు ఇస్తున్నారు అంటే ధరఖాస్తు చేసుకున్నాం అయినా రాలేదు. లంచాలు ఇవ్వడానికి మా వద్ద చిల్లి గవ్వ కూడా లేదు. గీప్రజా ప్రభుత్వం రేవంత్ రెడ్డీ ముఖ్య మంత్రి ఇ ళ్లు లేని వారికి, పూరి గుడి సెలో నివశిస్తున్న వారికీ రూ 5 లక్షల తో ఇళ్ళు నిర్మించి ఇస్తున్నారు అంటే సంబర పడి మాకు ఇక ఇళ్లు వచ్చేసి నట్లే అని బావంచి గీ రేవంత్ రెడ్డి సర్కార్‌కు కూడా ధరఖాస్తు చేసుకున్నావము అన్నీ అర్హతలు తమకు ఉన్నా తమకు ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వడం లేదు. లీడర్లు, పంచు కుంటున్నారు. వాళ్ళ బందవులకు, దగ్గరగా ఉన్న వాళ్ళకు మాత్రమే ఈ ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తున్నారు. మా లాంటి పేదవారని ఎవరూ పట్టించు కోవడం లేదు.



ఏనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ళు గుడిసెలు ఉన్న వారికీ కేటాయిస్తున్న సందర్భంగా మాకు ఇంది రమ్మ ఇళ్ళు ఇచ్చి మమ్మల్ని ఆదుకోండి కలెక్టర్ సారు అని సిరికొండ కు చెందిన విన్న వించుకుంటున్న నిరుపేద కుటుంబం. వివరాలు ఇలా ఉన్నాయి. ఇర్ఫానా అక్రమ్ సిరికొండ సిరికొండ గ్రామానికి చెందిన వ్యక్తినిరుపేద కుటుంబం. ముగ్గురు కుమారులు ఇద్దరు కుమా ర్తెలు ఉన్నారు. అందరూ ఒక ఇంట్లో నివసిస్తున్నారు. ఇటీవల మండలంలో ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు కావడం జరిగింది. కానీ మాకు న్యాయం జరగలేదు. గతంలో అధికారులు సర్వేలు కూడా చేశారు. దయచేసి మాకు ఆదుకోవాలని జిల్లా పాలనాధికారికి విన్నవించు కుంటున్నాము.

# ఘణంగా అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి

## ఘన నివాళులు అర్పించిన ఎంపీ, ఎమ్మెల్యే, నాయకులు

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 16, (ప్రజా జ్యోతి )**ఆదిలాబాద్ లో భారత మా జీ ప్రధానమంత్రి, భారత రత్న అటల్ బిహారీవాజ్‌పేయి వర్ధంతి బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా ఆదిలాబాద్‌లో ఆయనకు ఘననివాళులు అర్పించారు. ఆదిలా బాద్ ఎంపీ గోడం నగేష్, ఆదిలా బాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్, ఆదిలాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్‌లు పాల్గొని వాజ్ పేయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సేవకు అంకితమైన మహోన్న త నాయకుడు అటల్ బి హారీ వాజ్‌పేయి అని కొని యాడారు. తన రాజకీయ జీవితంలో విలువలు, ప్రజా సేవ, జాతీయ సమైక్యతకు ప్రాధాన్యతనిస్తూ దేశ అభి వృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. వాజ్‌పేయి ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకట స్వామి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు



జాదవ్ సుమన్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు బేర దేవన్న బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కాళ్ల సాయి, కౌన్సిలర్లు జోగు రవి, బండారి పోషన్న, మా జీ ఎంపీపీ నగర్గొజె భరత్, రాష్ట్ర నాయకులు మురిధర్ ఠాక్రే, మహిళా నాయకులు నివేదిత, దివ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొని వాజ్‌పేయి సేవలను స్మరించుకుం టూ ఘన నివాళులు అర్పించారు.

# మారుమూల గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద పీట

**అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు**

**ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్**

**ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 16, (ప్రజా జ్యోతి )** గ్రామాల అభివృద్ధి కోసం కేం ద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధుల ను మంజూరు చేస్తున్నదని అదిలాబాద్ ఎమ్మెల్యే పా యల్ శంకర్ అన్నారు. విబి జి రాంజీ నిధుల నుండి రూ 20 లక్షల నిధులతో సాత్నాల మండలం దౌన గ్రామపం చాయతీ భూమి నిర్మాణ కోసం ఆది వారం పూజ కార్యక్ర మం నిర్వహించారు. అదే విధంగా సైదు పూర్ గ్రామంలో వివో భవన నిర్మాణం కో సం భూమి పూజ చేశా మన్నారు. రైతులకు తమ చే నులోకి వెళ్లడానికి పొలం బాట చేపట్టినట్లుతెలిపారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసేలా అధి కారులు చర్యలు తీసుకోవాలన్నారు. విబి జిరాంజీ పథకం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కి ఎంతగానో ఉపయోగ ప డుతున్నదని. ఈ పథకాన్ని సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో రైతుల పండించినటు వంటి పంటను నిల్వ చేయడానికి



చిన్న గోదా ములను నిర్మించుకోవడానికి అవకాశం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రోహిదాస్, సుభాష్, పోతరాజు, రమేష్, ఎం సురేష్, పంద్రా రాము, కుంచాల మహేష్, దినేష్, లక్ష్మీబాయి, సర్పంచ్ వినోద్, సర్పంచ్ శ్యామ్ రావు, సర్పంచ్ కాలురాం, సర్పంచ్ రామ్‌లాల్, అంకుష్ కిష్టం ఎంపిటిసి, భూత్ అధ్యక్షులు, శక్తి కమిటీ అధ్యక్షులు, మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి పట్టణం లోని 15 వ వార్డు లో సీనియర్ నాయకుడు

**కన్నూరి వెంకటేష్ తండ్రి అయిన క్రీ.శే" కన్నూరి ఒధేలు మొదట వర్ధంతి కార్యక్రమానికి హాజరై వారి చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి నివలులు ఆర్పిన్చినా బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి దావ .స్వాతి - రమేష్ బాబు......**






**బెల్లంపల్లి, అగస్టు 16 (ప్రజాజ్యోతి):**మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం బెల్లంపల్లి లోని వార్డు నంబర్ 15 లో నివాసం ఉంటూన్నా కన్నూరి వెంకటేష్ తండ్రి క్రి.శే" కన్నూరి ఒధేలు గారు ఒక సంవత్సరం క్రీతం మరణించారు..వారి కుటుంబ సభ్యులు ఈ రోజు వారి ప్రధాన వర్ధంతి కార్యక్రమం నిర్వచించారు. ఈ కార్యక్రమములో భగంగా ప్రధమ వర్ధంతికి హాజరైన బెల్లంపల్లి పట్టణం మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి దావా.స్వాతి –రమేష్ బాబు పుష్పాంజలి సమర్పించి నివలు లూ అర్పించారు . వారిథో పాటు కౌన్సిలర్ బేతి శ్రావణ్ కుమార్,సీనియర్ నాయకులు. శంకర్,బండి రాము, లక్ష్మణ్,గెల్లి రామకాంత్,రాజనార్సు,వాజిద్ తదితరుల్లు పాల్గొన్నారు..

# ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం కొరకు సిర్పూర్(టి) నియోజకవర్గంలోని అన్ని మండలాలో

**ప్రజావాణి కార్యక్రమం,ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**సిర్పూర్ (టి)ఎంపిడిఓ కోట ప్రసాద్,చింతల ఎంపీడీఓ సత్యనారాయణ, బెజ్జూర్ ఎంపీడీ ఎంపీడీఓ ప్రవీణ్:**

**ఆగస్టు 16 సిర్పూర్(టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:**




కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియోజక వర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం కొరకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అన్ని మండల కేంద్రాల్లో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిర్పూర్ (టి) ఎంపీడీఓ కోట ప్రసాద్, చింతల మానేపల్లి ఎంపీడీఓ,పి. సత్యనారాయణ, బెజ్జూర్ ఎంపీడీఓ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారులు మాట్లాడుతూ.... సిర్పూర్(టి)నియోజక వర్గంలోని 7 మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కొరకు ఎన్నో ఇబ్బందులతో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు వెళ్లవలసి వస్తుందని ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జిల్లా అధికారులు సిర్పూర్(టి) నియోజకవర్గ ప్రజల కోసం అన్ని మండలాల్లో ప్రజావాణి ఫిర్యాదుల స్వీకరణ తక్షణ పరిష్కారం కోసం సిర్పూర్(టి) నియోజక వర్గంలోని అన్ని మండల రేపటినుండి తేదీ 17/08/2026 రోజు నుండి ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.